తెల్లరేషన్ కార్డు దారులందరూ

ఆధార్ కార్డులను ఈకేవైసీ చేయించుకోవాలి

● 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో సర్కిల్-6 ఏఎస్‌వో దీప్తి



రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డుదారులు ఆధార్ కార్డులను ఈకేవైసీ చేయించుకోవాలని సివిల్ సప్లై సర్కిల్-6 ఏఎస్‌ఓ డి. దీప్తి తెలిపారు. సర్కిల్‌లో ఇప్పటి వరకు 81 శాతం మంది ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారు చేయించుకోవాలని సూచించారు. సర్కిల్ పరిధిలో ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఉన్న రేషన్ షాపులు, వినియోగదారులు, సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులు, రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ నివారణ చర్యలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: సర్కిల్-6లో ఎంతమంది రేషన్‌కార్డు దారులు ఉన్నారు, ఎన్ని షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల సరఫరా జరుగుతోంది?

ఏఎస్‌ఓ: ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో 58,782 తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి 69 రేషన్ డీలర్ల ద్వారా బియ్యం, గోధుమలు, చక్కెర సరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: తెల్లరేషన్ కార్డు దారులకు నెలకు ఎన్ని మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు?

ఏఎస్‌ఓ: సర్కిల్ పరిధిలోని 58,782 తెల్ల కార్డు దారులు, 18 మంది అన్నపూర్ణ కార్డు దారులు, 1,788 మంది అంత్యోదయ లబ్ధిదారులకు కలిపి మొత్తం 9,92,195 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నాం. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం, ప్రతి కార్డుకు ఐదు కిలోల గోధుమలు, అన్నపూర్ణ కార్డు వారికి పదిలో కిలోల బియ్యం, అంత్యోదయ కార్డు వారికి పది కిలోల బియ్యం, కిలో చక్కెర ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలింపుపై ఏ చర్యలు తీసుకుంటున్నారు?

ఏఎస్‌ఓ: రేషన్ బియ్యం బ్లాక్‌మార్కెట్‌కు తరలించకుండా రేషన్ షాపుల వద్ద సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నాం. కార్డుదారులు బియ్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే వారి కార్డుల రద్దుకు చర్యలు తీసుకుంటున్నాం. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నారా?

ఏఎస్‌ఓ: కొత్త రేషన్ కార్డుల కోసం చాలామంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. అవన్నీ జీహెచ్ఎంసీ వద్దే ఉన్నాయి. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తాం.

ఆంధ్రజ్యోతి: కేంద్ర ప్రభుత్వం భారత్ రైస్ పేరుతో 29 రూపాయలకే సన్న బియ్యం ఇస్తామని ప్రకటించింది, సర్కిల్-6 పరిధిలో ఎప్పుడు అమలులోకి వస్తుంది?

ఏఎస్‌ఓ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారత్ రైస్ గురించి తమకు ఎలాంటి గైడ్‌లైన్స్, ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే భారత్ రైస్ పథకాన్ని అమలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

ఏఎస్‌ఓ: రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడకుండా తనతోపాటు, ఇన్‌స్పెక్టర్లు షాపుల్లో స్టాకును తనిఖీ చేస్తున్నాం. బినామీ రేషన్ డీలర్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అక్రమాల నివారణకు విజిలెన్స్ తనిఖీలు చేపడుతున్నాం.

10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో స్పెషల్ క్లాసులకు హాజరవుతున్న 10వ తరగతి విద్యార్థులకు రాజపేట చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్. ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం అల్పాహారం పంపిణీ చేశారు. దేవాదాయ శాఖ ఈవో జ్యోతి, ట్రస్ట్ ప్రతినిధులు సుందర్‌పటాలే, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి పాల్గొన్నారు.

- ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

సీఎంపై కేటీఆర్ ఆరోపణలు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న బి. యాదగిరిగౌడ్

కవాడిగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోగానే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంటారం యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షుడు ఆర్‌కే శ్రీనివాస్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు జి. జయేందర్‌బాబు అన్నారు. సోమవారం కవాడిగూడలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రోళ్ల బూట్లు నాకి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కేటీఆర్ పాత్ర ఏమిటో ప్రజలకు తెలుసని, రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుని అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఘోర పరాభవం తప్పదన్నారు.

ఎన్నికల బాండ్స్‌పై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్స్ వివరాలు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించడానికి జూన్ 30వ తేదీ వరకు సమయం పొడిగించాలని భారతీయ స్టేట్ బ్యాంకు వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సోమవారం వెలువరించిన తీర్పు హర్షణీయమని ఏఐసీసీ జాతీయ లీగల్ కో-ఆర్డినేటర్ చల్లా దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం డీడీ కాలనీలో తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. సుప్రీం తీర్పును తక్షణమే అమలు చేస్తూ ఎన్నికల బాండ్స్ వివరాలను ఎస్‌బీఐ కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు చల్లా దామోదర్ రెడ్డి అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 5 లక్షలతో ఆర్వో ప్లాంట్



ఏర్పాటు చేయనున్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ అన్నారు. జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. పాఠశాలలో సదుపాయల గురించి ప్రిన్సిపాల్ స్వర్ణలతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రూ. 5 లక్షల సీఎస్ఆర్ నిధులతో పాఠశాలలో త్వరలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బల్లలు, కుర్చీలు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అల్లం యాదయ్య

నల్లకుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓబీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (టీఓబీసీఈఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యూనియన్ బ్యాంక్ ఉద్యోగి అల్లం యాదయ్య నియమితులయ్యారు. యూనియన్ అధ్యక్షుడు వి.దానకర్ణచారి, ప్రధాన కార్యదర్శి జి.పాండు ఆయనకు సోమవారం నియామకపత్రం అందజేశారు.

పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

● మహాత్మానగర్‌లో రూ. 23 లక్షలతో సీసీ రోడ్డు

● దీన్‌దయాల్‌నగర్‌లో రూ. 14 లక్షలతో నాలా ప్రహరీ



మహాత్మానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్

ముషీరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో రూ. 23 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. మహాత్మానగర్‌లో వాంబే ఇళ్ల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పండరీనాథ్ తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, మైనారిటీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చుకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్‌నగర్‌లో..

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ దీన్‌దయాల్ నగర్ బస్తీ సమగ్రాభివృద్ధి, నాలా సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. రూ. 14 లక్షల వ్యయంతో చేపట్టనున్న కూలిన నాలా ప్రహరీ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బల్ల శ్రీనివాస్ రెడ్డి, కె. సురేందర్, నాయకులు చిట్టి, అస్లాం, ఖదీర్, గురుదీప్‌సింగ్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరమ్మ బాడలో సమస్యల పరిష్కారానికి చర్యలు

కవాడిగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో బస్తీలు, కాలనీల్లో సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. సోమవారం దోమలగూడలోని ఈశ్వరమ్మబాడలో అధికారులతో కలిసి పాదయాత్ర చేసి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. బస్తీలో కలుషిత నీరు సరఫరా అవుతోందని, దోమలగూడ శ్మశాన వాటిక నుంచి బస్తీలోకి పాములు వస్తున్నాయని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

బస్తీలో సమస్యలపై కమిటీ అధ్యక్షుడు చింతలకుమార్ యాదవ్, చైర్మన్ జగన్‌గౌడ్, ప్రధాన క్యాదర్శులు సురేష్‌గౌడ్, వి సంతోష్, చింతల హరీష్ ఎమ్మెల్యే, అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బస్తీలో సమస్యలు పరిష్కరించాలని, సూరజ్‌నగర్‌లో హుస్సేన్‌సాగర్ మూసీ నాలా ప్రహరీ నిర్మాణపనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, నేతలు పానుగంటి ప్రభాకర్, సంతోష్, లడ్డా, ట్రాన్స్‌కో, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బిరుదులు పొందిన మహిళలతో వైఎస్ఆర్ మూర్తి తదితరులు

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతసేవా సమాజ్ హరినగర్, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్, నైన్ హెల్త్‌కేర్ సెంటర్ల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం హరినగర్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పైడి సుచరితరెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో దక్షిణ భారత సేవా సమాజ్ అధ్యక్షుడు జి.రమేష్, ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.రవి, కోశాధికారి గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు మహిళలకు బిరుదుల ప్రదానం

చిక్కడపల్లి: నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి అన్నారు. చారిటబుల్‌ట్రస్ట్, హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలో ఆ సంస్థల కార్యాలయంలో మహిళాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్యకళాకారిణి ఝాన్సీని నాట్యవిశిష్ట, సాహితీవేత్త నామని సుజనదేవిని సాహిత్య సౌగంధి, యాంకర్ మీనాకుమారికి మెలోడీ క్వీన్ బిరుదు ప్రదానం చేశారు. న్యాటకళాకారిణులు నందిత, సమ్మోహనకృష్ణను చాట్య చతుర బిరుదులతో సత్కరించారు. డా. సురభి లక్ష్మీశారద, రాజనాల శ్రీదేవి, కామేశ్వరి పాల్గొన్నారు.

● చిక్కడపల్లి బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆలిండియా రేడియో సీనియర్ అనౌన్సర్ ఐనంపూడి శ్రీలక్ష్మి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి డా. వరలక్ష్మి మంచాల, శాంతలక్ష్మి ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డా. లక్ష్మీమాధవి ప్రజాపతి, అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు మరియం అజీమ్, ఫిజియోథెరపిస్ట్ శ్రీదేవిని సన్మానించారు. బ్రహ్మకుమారి చిక్కడపల్లి ఇన్‌చార్జి జయశ్రీ ఈ సందర్భంగా మెడిటేషన్ గురించి వివరించారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నేతలు

కుట్టు మిషన్ల పంపిణీ

నల్లకుంట: చాత్తాద శ్రీవైష్ణవ మహిళల అవసరాలకు సంఘం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో తిలక్‌నగర్‌లోని సంఘం భవన్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 200 మందికిపైగా మహిళలు హాజరయ్యారు. ఆటలు, క్విజ్, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేశారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బిక్కుమళ్ల నిర్మల మనోహర్, డాక్టర్ టి. మదన్ మోహన్, పుష్పాంజలి, మాధవి, డాక్టర్‌లలిత తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళాశాలలో..

రాంనగర్: బాగ్‌లింగంపల్లిలో అంబేడ్కర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అపోలో ఆస్పత్రి ముఖ్య డైటీషియన్ డాక్టర్ సౌమ్య జ్యోతి మహిళలకు డైటింగ్ ప్రాధాన్యతను వివరించారు. కళాశాల యాజమాన్యం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ డైరెక్టర్ రమణకుమార్, డైరెక్టర్ రిషికాంత్, ప్రిన్సిపాల్ మట్టు శేఖర్, ఫ్యాకల్టీలు కీర్తన, అనూష తదితరులు పాల్గొన్నారు.

పోటీపరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు

పుస్తకాల పంపిణీ

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సిటీ సెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న పోటీపరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలను వెటర్నరీ యూనివర్సిటీ రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి. దేవేంద్రరావు ఆయన తల్లిదండ్రులు పి.రాములు, తులసిరత్నం జ్ఞాపకార్థం సోమవారం పంపిణీ చేశారు. ఈ పుస్తకాలు పోటీపరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని లైబ్రరీ కార్యదర్శి పి.పద్మజ, గ్రేడ్-1 గ్రంథపాలకుడు జి. మదన్ మోహన్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ రిటైర్డ్ అధికారి వీవీవీ సత్యనారాయణ, ఎలక్ట్రిసిటీ అధికారి సీహెచ్‌వీ దుర్గాప్రసాద్, గ్రూప్ 1 అధికారుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి నూతనకంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు 8 లోక్‌సభ సీట్లు కేటాయించాలి'

త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయపార్టీలు బీసీలకు 8 సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

వస్తువుల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ కన్స్యూమర్స్ రైట్స్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ సి. చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం చిక్కడపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్స్యూమర్ రైట్స్ గురించి ప్రజలకు అవగాహన ఉండాలన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద 53 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, విజయకుమార్‌గౌడ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, తహసీల్దార్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్: బాగ్‌లింగంపల్లిలో హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ సోమవారం పంపిణీ చేశారు. 14 మందికి కల్యాణలక్ష్మి, ఆరుగురికి షాదీముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఘువంశీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'డిప్యూటీ సీఎంకు ముఖ్యమంత్రి, మంత్రులు క్షమాపణ చెప్పాలి'

కవాడిగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజు డిమాండ్ చేశారు. మాదిగ రాజ్యాధికార పోరాట సమితి ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. యాదగిరిగుట్టలో జరిగిన పూజా కార్యక్రమంలో సీఎం, ఆయన సతీమణి, మంత్రులు కుర్చీలపై కూర్చొని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను నేలపై కూర్చోబెట్టడం దారుణమన్నారు.

నేడు రైల్వే కోచ్ రెస్టారెంట్ జాతికి అంకితం

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను ప్రధాని మోదీ మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్ పాత రిజర్వేషన్ కౌంటర్ వద్ద 2016లో రైల్వే స్టేషన్ శతాబ్ది వేడుకల సందర్భంగా ప్యాలెస్ ఆన్ వీల్స్ పేరిట రెండు బోగీలను రెస్టారెంట్‌గా ఏర్పాటు చేసినా ప్రారంభానికి నోచుకోలేదు. 2023లో ఈ బోగీలను రైల్వే అధికారులు పరివార్ గ్రూప్ సంస్థకు అప్పగించగా కోచ్ రెస్టారెంట్‌గా తీర్చిదిద్దారు. మంగళవారం ఉదయం 9.15 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్‌గా కోచ్ రెస్టారెంట్‌ను జాతికి అంకితం చేస్తారని కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు. చేతివృత్తులను ప్రోత్సహించేందుకు స్టేషన్‌లో చేనేత స్టాల్ ఏర్పాటు చేశారు. దీనిని కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. కోచ్ రెస్టారెంట్, చేనేత స్టాల్ ప్రారంభమై 8 నెలలు కావస్తున్నప్పటికీ ప్రధాని మంగళవారం జాతికి అంకితం చేయడం కొసమెరుపు.



మాట్లాడుతున్న వాంబే వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి

వాంబే ఇళ్ల అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలి


బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రసూల్‌పుర కృష్ణానగర్‌లో కట్టమైసమ్మ వద్ద నిర్మించిన వాంబే ఇళ్ల పంపిణీలో జరిగిన అక్రమాలపై న్యాయవిచారణ జరిపించాలని వాంబే వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు సుదర్శన్, ప్రతినిధులు గడ్డం ఏబెల్, సయ్యద్ సలీం, బి.వి.వెంకట్రావ్, ఎం.జనార్దన్, వి.ఆర్.విజయ్‌రాజు మాట్లాడారు. 2002లో 693 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని అన్నారు. వాంబే స్కీం కింద ఇళ్లు నిర్మిస్తుండడంతో అధికారులు పట్టాలను వాపసు తీసుకున్నారని తెలిపారు. 2010లో 11 బ్లాకులలో 484 వాంబే ఇళ్లు నిర్మించారన్నారు. అనర్హులు ఇళ్లను ఆక్రమించుకున్నారని, పట్టాలు పొందిన దాదాపు 50 మంది పేదలకు అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని వారు కోరారు.

మైదాన ప్రాంత గిరిజనులకు

ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

● భారతీయ బంజారా సేన

మైదాన ప్రాంత గిరిజనులకు ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని భారతీయ బంజారా సేన డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారతీయ బంజారా సేన మహిళా విభాగం అధ్యక్షురాలు రుక్మిణిబాయి, రాష్ట్ర అధ్యక్షుడు చంద్రునాయక్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శేషరామ్ నాయక్, రాష్ట్ర సేవాలాల్ సేన కళాబృందం అధ్యక్షుడు ప్రేమ్‌చంద్ నాయక్ మాట్లాడారు. గిరిజన జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను 10 శాతం పెంచాలని, గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో గిరిజనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, గిరిజన బీమా ఏర్పాటు చేయాలని, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతి, రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తింపచేయాలని, గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.



'నేను మోదీ ఒకే కుటుంబ సభ్యులం' కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు

బీజేపీకి వస్తున్న ఆదరణ చూసి

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో వణుకు

● డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి వస్తున్న ప్రజల ఆదరణ చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో వణుకు పుడుతుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. సోమవారం బర్కత్‌పుర చౌరస్తా వద్ద 'నేను మోదీ ఒకే కుటుంబ సభ్యులం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ 10 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, సి.నందకిషోర్‌యాదవ్, సి.వినోద్ యాదవ్, కృష్ణకుమార్, ఎస్.ఎస్.రామ్, నర్సింగ్‌రావు, క్షీరసాగర్, ఆర్. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్: 'నేను మోదీ ఒకే కుటుంబ సభ్యులం' కార్యక్రమాన్ని డీడీ కాలనీలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి, బాగ్‌అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. 35 ఏళ్ల వయసు గల వ్యక్తి సోమవారం కాచిగూడ - విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడ్డాడు. మృతుడి వివరాలు తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మౌలాలిలో నివసిస్తున్న నాసిర్ ఖాన్(32) డీసీఎంలో సోమవారం రాత్రి రేషన్ బియ్యం తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కాచిగూడ టూరిస్ట్ హోటల్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని నాసిర్‌ఖాన్ అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

ఓ విద్యార్థిని అదృశ్యమైంది. రంగారెడ్డి జిల్లా కందుకూరుకు చెందిన రాజు కుమార్తె కుసుమ(19) కోఠి ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతూ ఇసామియా బజార్‌లో బాలికల హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 7వ తేదీన ఆమె తల్లి రాజి నగరానికి వచ్చి హాస్టల్‌కు వెళ్లింది. కుసుమ కనిపించకపోవడంతో కంగారు పడింది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో రాజి సోమవారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేపాల్ ఉప ప్రధానిగా

ఉపేంద్రయాదవ్ నియామకంపై హర్షం

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశ ఉప ప్రధానమంత్రిగా ఉపేంద్రయాదవ్ ప్రమాణ స్వీకారం చేయడం పట్ల అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి చిట్టబోయిన నందకిషోర్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఆ దేశ ఉప రాష్ట్రపతిగా రాంప్రసాద్‌యాదవ్‌ను నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. యాదవ జాతిని నేపాల్ దేశం గౌరవించడం అభినందనీయమన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మలేషియా అంతర్జాతీయ శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ ఉగాది పురస్కారాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మిరియాల జానికిరామ వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైజ్ఞానిక, విజ్ఞాన, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సేవా, సినీ, క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉగాదిని పురస్కరించుకుని మే 10న కౌలాలంపూర్‌లో పురస్కారాలు అందజేస్తామన్నారు. వివరాలకు 9666910480 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రేపు రాయప్రోలు సుబ్బారావు జయంతి

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భావకవితా యుగకర్త రాయప్రోలు సుబ్బారావు 132వ జయంతి ఈనెల 13న త్యాగరాయగానసభలో వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు డా. వంశీ రామరాజు సోమవారం తెలిపారు. సినీనటులు తనికెళ్ల భరణి, రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొంటారన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం కంటే 515 టీఎంసీల నీరు నేడు జలాశయాలలో తక్కువగా ఉందని, దీంతో నీటి సమస్య తలెత్తుతుందన్నారు. నీరురాని ప్రాంతాల ప్రజలకు ట్యాంకర్లు పంపించాలన్నారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్ నాయకులు జి.యాదగిరిరావు, ఎస్.ప్రకాష్, నాగ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిబాబా, కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362